

# స్నేహం

ఒక్కొక్క సామానూ యింట్లోంచి లారీలోకి ఎక్కుతుంటే యిల్లు ఖాళీ అయిపోతోంది.

ఇల్లు శూన్యంతో నిండుతున్న కొద్దీ జయ మనసులో బరువు పెరుగుతోంది.

ఇల్లు ఖాళీ చేయటం ఎంత తేలిక - మనసు ఖాళీ చేయటం ఎంత అసాధ్యం !

మనసులో వున్న స్నేహాన్ని తీసి అవతల పారేయటమంటే యింట్లో పనికిరాని చెత్తను బైటపారెయ్యటమా? మోహనరావుకి అట్లాగే వుంది.

ఎంత నిశ్చింతగా, చురుగ్గా సామాన్లు లారీలోకి ఎక్కిస్తున్నాడో!

చక్రవర్తి కోసం అతని మనసు ఒక్క క్షణమైనా బాధ పడటం లేదా?

కానీ మాలతి కోసం తన ప్రాణం కొట్టుకు పోతోందే - మాలతి స్నేహం దూరమైపోతుందనుకుంటే తనకు కాళ్ళు ఒణికి పోతున్నాయే -

జయ మనసు చుట్టూ పరుచుకుని వున్న సామానులన్నిటినీ దాటుకుంటూ స్నేహం చుట్టూ తిరుగుతోంది. స్నేహం - ఈ పదం - ఈ భావం - దాని చుట్టూ అల్లుకున్న భావజాలం

వీటికెంత శక్తి వుంది - స్నేహితులు కలిగించినంత ఆనందాన్నీ, వాళ్ళు కలిగించినంత బాధనూ మరే బాంధవ్యంలో వున్నవాళ్లూ కలిగించరేమో - చిత్రమేమిటంటే ఏ సంబంధంలో నైనా అంతో యింతో స్నేహం కలిస్తేనే గాని అది నిజంగా మనల్ని ఆనంద పెట్టలేదు.

అన్ని బాంధవ్యాలలోనూ అల్లుకుపోవాలని చూసే ఈ స్నేహానికి అడుగడుగునా ఆటంకాలే గదూ -

అన్ని ఆటంకాలనూ అధిగమించి కడదాకా స్నేహదీపాన్ని వెలిగించటం ఎందరికి సాధ్యమవుతుంది?

ఎందరు స్నేహితులు మిగులుతారు చివరికి ?

ఎవరైనా స్నేహాన్నీ - స్నేహమనే భావాన్నీ ప్రేమించినంతగా స్నేహితులను ప్రేమిస్తారా?

మనం భావనలను ప్రేమించినంతగా భౌతిక వాస్తవాలను ప్రేమించమేమో !

ఎందుకనీ? భావన అనేకమంది మనుషుల అనుభవాల సారం నుండి తయారవుతుంది. చరిత్ర రూపంలో, సాహిత్య రూపంలో తిరిగి మనుషులకు అందుతుంది. ఆ భావన ఎంతగా ఒంటబడితే మనుషులు అంతగా విశ్వాసాన్ని పెంచుకుంటారు. కానీ స్నేహితులు నిత్య జీవితంలో అనేక ఘర్షణలమధ్యా ఉద్రిక్తతల మధ్యా స్నేహాన్ని కాపాడుకోవాలంటే కత్తిమీద సాము చేయాలి. అలా చేసినవాళ్ళు మళ్ళీ చరిత్రలోనో, సాహిత్యంలోనో మిగిలిపోతారు. మళ్ళీ స్నేహం యొక్క విలువనూ, బరువునూ, లోతునూ పెంచుతారు.

జీవితమంతా స్నేహం కోసం ఆరాటపడిన తను స్నేహితురాలిగా తన పాత్రనెంత వరకూ సరిగా నిర్వహించింది? ఎందరిని బాధ పెట్టింది!?

ఒక్కసారి ఆ స్నేహపు జ్ఞాపకాల అలలతో తన పాదాలను తడుపుకోవాలనీ, కాళ్ళ కింద నేల కదిలిపోతుందో లేదో చూసుకోవాలనీ బలంగా అనిపించింది జయకు.

కాళ్ళకింద నేల కదిలిపోతుందనే విషయలో జయకేమీ సందేహం లేదు. కానీ కదిల్చే ఆ శక్తులకు అంత బలమేమిటి? ఎక్కడి నుంచి వచ్చిందా బలం? దాన్ని ఎదుర్కోటం ఎట్లా - యిది తెలియదు జయకు.

అసలు తను ఎవరితోనైనా స్వేచ్ఛగా స్నేహం చేయగలిగిందా?

లేదు - అది జయకు చాలా స్పష్టంగానే తెలుసు. స్వేచ్ఛకూ స్నేహానికీ వున్న సంబంధం ఎంత దగ్గరిది! స్వేచ్ఛ లేనిదే స్నేహం లేదు. స్నేహం లేనిదే స్వేచ్ఛకు అర్థం లేదు. మనుషుల మధ్య మరింత స్నేహ పూరిత వాతావరణం సృష్టించటానికే గదూ స్వేచ్ఛ.

తనకు స్వేచ్ఛ లేదు. అందుకే స్నేహితుల్ని మధ్యలో ఒదిలేసి వెళ్ళిపోతుంది.

మరియమ్మను ఒదిలేసింది. సుగుణను ఒదిలేసింది. సరితను ఒదిలేసింది - ఇపుడు మాలతిని ...

ఊహ తెలిసినప్పటినుంచీ తన స్నేహాలకు ఎప్పుడూ అంక్షలే.

ఎట్లా సహించింది - ఎందుకు సహిస్తోంది? నిజానికి చాలా రోజులు అది తన స్నేహ జీవితం మీద తనవాళ్ళు పెట్టిన నిర్బంధం అని జయకు తెలియదు. మరియమ్మ విషయంలో అసలు తెలియదు.

జయ ఆరో తరగతిలోనే బళ్ళో చేరింది. అప్పటి వరకూ యింట్లోనే చదివింది. ఒక టీచరుగారొచ్చి చెప్పేవాళ్ళు. ఆరో తరగతిలో చేరి బెరుగ్గా స్కూల్లోకి వచ్చిన జయను నవ్వుతూ ఎదురొచ్చి క్లాసులోకి తీసికెళ్ళింది మరియమ్మ. క్లాసులో అప్పటికే తనకున్న స్నేహితుల్ని జయకు పరిచయం చేసింది. జయ పదిరోజులు ఆలస్యంగా చేరటం వల్ల బెంచీలన్నీ నిండిపోయాయి. చివరి వరసలో మూడు బెంచీలు మాత్రం ఖాళీగా వున్నాయి. ఒకో బెంచీమీద ముగ్గురు కూచోవచ్చు. కానీ జయ ఒక్కత్తే - ఆ పిల్లకు ఏడుపొచ్చింది. ఆ వెనక బెంచీలోకి కొత్తగా వచ్చిన పిల్లకోసం ఎవరొస్తారు? ఎవరూ అందుకు సిద్ధపడలేదు. గుడ్లనీళ్ళు గుడ్ల కక్కుకుంటూ వెనక్కి నడిచింది. కాసేపు అట్లాగే నుంచుంది. చివరికిక చేసేది లేక బెంచీ మీద కూచుని తలవంచుకుని పుస్తకాలు డెస్కులో సర్దుకుంటుండగా జయ భుజం మీద ఎవరిదో చేయి పడింది. చల్లగా, మంచుముద్దలా ముడుచుకుపోయిన జయ గుండెల్లోకి వెచ్చదనాన్ని పంపింది. జయ తల ఎత్తి పక్కకు చూస్తే మరియమ్మ..

ఆ కళ్ళల్లో ఎట్లాంటి నవ్వు. అంత దయగల, ప్రేమగల నవ్వు మళ్ళీ జయ ఎన్నడూ చూడలేదు.

మరియమ్మ జయకోసం వెనకబెంచీలోకి వచ్చింది - మొదటి బెంచీలో ముందట కూచునే మరియమ్మ.

జయ, మరియమ్మ ఎన్ని కబుర్లో చెప్పుకునే వాళ్ళు. మరియమ్మ నవ్వంటే జయకెంతో యిష్టం. ఆ పిల్ల ఎంతబాగా నవ్వేదో అంత బాగా పాడేది. ఏసు ప్రభువు మీద ఎన్ని పాటలు వచ్చో మరియమ్మకు. హల్లెలూయా - హల్లెలూయా అన్న పదం మరియమ్మ పెదవుల గుండా ఎంత మధురంగా వచ్చేదో ! మరియమ్మ జయకంటే రెండేళ్ళు పెద్దది. జయకంటే చాలా పేదది.

ఆ సంగతి మొదటిసారి మరియమ్మ యింటికి వెళ్ళినపుడు జయకు తెలిసింది.

వాళ్ళది పూరిల్లు. శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టారు. ఇంటి ముందున్న కాస్త చోటులో కనకాంబరాలు తెగపూశాయి. బంతి మొగ్గ తొడిగి వుంది. మరియమ్మ తల్లి పొగాకు కంపెనీలో గ్రేడింగు పనికి వెళ్తుంది. వాళ్ళ నాన్న ముఠా పనికెళ్తాడు. వాళ్ళకు మరియమ్మ ఒక్కతే కూతురు. కూతుర్ని చదివించాలని కష్టపడుతున్నారు. మరియమ్మంటే వాళ్ళ కెంత యిష్టమో వాళ్ళతో గడిపిన ఐదు నిమిషాల్లోనే జయకు తెలిసిపోయింది.

ఇద్దరికీ యిన్ని శనగపప్పు, యింత బెల్లం ముక్కా పెట్టింది మరియమ్మ తల్లి.

ఆ రోజు సాయంత్రం మరియమ్మతో కబుర్లు చాలించి యింటికి వెళ్ళేసరికి ఆలస్యం అవనే అయింది.

ఇంటి దగ్గర అమ్మా, నాయినమ్మా ఎదురు చూస్తున్నారు. జయ మరియమ్మ సంగతి చెప్పగానే వాళ్ళమ్మ ముఖం చిట్లించి -

"ఎందుకు అడ్డమైన వాళ్ళ కొంపలన్నీ తిరుగుతావు? బడి ఒదల ానే రాలేవూ?" అంటూ జయను స్నానాల గదిలోకి నెట్టింది.

ఆ రాత్రి నాయనమ్మ జయను పక్కలో పడుకోబెట్టుకుని తక్కువ కులాల వాళ్ళతో స్నేహం చేయకూడదనీ, బళ్ళోనైనా వాళ్లకు కాస్త దూరంగానే వుండాలనీ, వాళ్ళ యిళ్ళకసలు వెళ్ళ కూడదనీ మెల్లిగానే అయినా గట్టిగానే చెప్పింది.

జయకు ఆ మాటలు అర్థం అయ్యాయి - కాలేదు. కానీ ఏడుపొచ్చింది. ఈ మాటలన్నీ మరియమ్మకు తెలిస్తే - మరియమ్మ వింటే -

మరియమ్మ మీద జాలితో స్నేహంతో జయ చిన్న గుండె నిండిపోయింది.

ఇంతలో మరో పెద్ద సందేహం.

(మరియమ్మను తన యింటికి తీసుకు రాకూడదా? ఆ పిల్ల వస్తానంటే ఏం చెయ్యాలి? ఒద్దనాలా? ఛీ -' జయ మనసు భయంతో ముడుచుకుపోయింది. మర్నాడు మరియమ్మతో అంతకు ముందులా స్వేచ్ఛగా మాట్లాడలేక పోయింది. పది రోజులు గడిస్తే గాని జయలో బెరుకూ, గిల్టీ ఫీలింగూ తగ్గలేదు.

ఇంతలో ఓ రోజు హఠాత్తుగా మరియమ్మ బడికి రాలేదు. ఒంట్లో బాగోలేదేమో అనుకుంది జయ.

కానీ వరుసగా నాలుగు రోజులు రాలేదు మరియమ్మ. ఐదో రోజు క్లాసు పిల్లలకు అసలు విషయం తెలిసింది. మరియమ్మ పెద్దమనిషయిందంట. అట్లా అవటం అంటే ఏమిటో జయకు కొంత తెలుసు. రెండేళ్ళ క్రితం జయ అక్క పెద్దమనిషయింది. హడావుడంతా జరిగింది. మరియమ్మ పెద్దమనిషయిందనే సరికి జయకు నవ్వొచ్చింది. సంతోషం కూడా కలిగింది. వెంటనే వెళ్ళి మరియమ్మను చూడాలనిపించింది. జయతో బాటు మరో ఐదారుగురు కూడా బయల్దేరారు.

మరియమ్మ వీళ్ళను చూసి సిగ్గుపడుతూ నవ్వింది. కానీ ఏం మాట్లాడలా. తలొంచుకుని కూచుంది. నేలమీద తాటాకులు పరిచి దాని మీద వరిగడ్డి వేసి దాని మీద పాత దుప్పటి పరిచి ఓ మూలగా కూచోబెట్టారు మరియమ్మను. అందరూ మరియమ్మను కాసేపు కుతూహలంగా చూసి యిళ్ళకు వెళ్ళిపోయారు.

ఐతే ఆ రోజు ఆలస్యానికి కారణం మరియమ్మ యింటికెళ్ళటం కాదు, సుగుణ వాళ్ళింటికి వెళ్ళటం వల్ల. అట్లా అని యింట్లో అబద్ధం చెప్పింది జయ.

అందువల్ల యింట్లో రాద్ధాంతమేమీ జరగలేదు. మరో పదిరోజులకు క్లాసులలో పిల్లలకు ఎలా వచ్చిందోగాని ఓ పిలుపు వచ్చింది. మరియమ్మ స్నానం చేసి యిట్లోకొచ్చే రోజు భోజనాలు పెడతారట. ఆరో క్లాసు పిల్లల్ని రమ్మని చెప్పి పంపారట.

భోజనాల సంగతి జయకు కూడా తెలిసింది. మరియమ్మ ఇంటికి భోజనానికి వెళ్ళాలా? వెళ్ళాలనే జయ మనసు పీకింది. కానీ ఆరోజు స్కూలుంది. ఎట్లా వెళ్ళటం. కానీ స్కూలుంటేనే వెళ్ళటం సులువని మల్లీశ్వరి చెప్పింది.

మధ్యాహ్నం అన్నాల బెల్లు కొట్టినప్పుడు టిఫిను కారియర్లలో అన్నం తినకుండా మరియమ్మ వాళ్ళింటికి వెళ్ళి అక్కడ తింటారు. ఇక మరి బడికి రాకుండా అక్కడే కాసేపు ఆడుకుని ఏకంగా యింటికెళ్తారు. ఎవరెవరొస్తారని లెక్కలు వేస్తే ఆరుగురు తేలారు.

"పోనీ టీచర్‌గారితో చెప్పే వెళ్దాం" అంది సుందరి. ఆరుగురూ వెళ్ళి థెరిసా టీచరు గారి అనుమతి అడిగారు. ఆమె వెళ్ళమంది.

జయా మిగిలిన అమ్మాయిలూ ఒక్క పరుగు తీశారు. అక్కడ మరియమ్మ యింటి ముందు చిన్న పందిరి వేశారు. చాలామంది జనం వచ్చారు. ఈ పిల్లల్ని చూడగానే మరియమ్మా వాళ్ళమ్మ వాళ్ళను దగ్గరకు పిల్చి లోపలికి పంపింది. మరియమ్మ కొత్తబట్టల్లో మెరిసిపోతోంది. అందరూ కలిసి అన్నాలు తిన్నారు. ఆ రోజు తిన్న లడ్ల రుచి యింకా జయకు గుర్తుంది.

కానీ ఆ రోజు తను తిన్న దెబ్బల రుచి కూడా జయకు బాగా గుర్తుంది.

"మాల కూడు తిని వస్తావా" అంటూ నాన్న జయ వీపు మీద బాదేశాడు. మరియమ్మతో స్నేహం మానేస్తానని ఒట్టేసే దాకా నాయినమ్మ ఒదల్లేదు.

మర్నాడు బళ్ళో మరియమ్మను చూసి జయ ఎంతో ముడుచుకుపోయింది.

మరియమ్మ తన పక్కకొచ్చి కూచుని నవ్వుతూ మాట్లాడబోయేసరికి జయ పుస్తకాలు సర్దుకుని పక్కనున్న ఖాళీ బెంచీలోకి వెళ్ళి కూచుంది. మరియమ్మ అయోమయంగా తన వంక చూసిన చూపు జయ ఎన్నటికీ మర్చిపోలేదు.

మరియమ్మతో స్నేహం అలా ఆగిపోయింది. కొత్త స్నేహితురాలు కావాలిగా!

సుగుణ - సుగుణదీ జయదీ ఒకటే కులం. ఆ ఏడాది పరీక్షల కింకా మూడు నెల్లే టైముంది. ఆ మూడు నెల్లూ యిద్దరూ కలిసి చదివారు. ఎండాకాలం శలవలన్నీ కలిసి ఆడుకుంటూ గడిపేశారు. బోలెడు పుస్తకాలు కూడా చదివారు. సుగుణే తనకు నవలలు చదవటం నేర్పింది.

కానీ ఎండాకాలం శలవలయ్యాక సుగుణ మరి బళ్ళోకి రాలేదు. శలవల చివర్లో సుగుణ పెద్దమనిషయింది. వాళ్ళింట్లో వాళ్ళంతా కలిసి సుగుణ చదువు ఆపేయించాలని తీర్మానించారు. పెళ్ళి సంబంధాలు కూడా చూడటం మొదలుపెట్టారు. తనూ సుగుణా వాళ్ళింటి డాబా మీద కూచుని ఎంత ఏడ్చారో -

"పెద్ద మనిషయితే చదువెందుకే ఆపటం?" అని తను అడిగితే పాపం సుగుణ మాత్రం ఏం చెబుతుంది. సుగుణ స్నేహం మరుపుకు రావటానికి చాలా రోజులే పట్టింది. ఇంకెవరితోనూ స్నేహం చేయాలనిపించలేదు చాలా రోజులు.

తన చదువుకూడా ఆపేస్తారా పెద్దమనిషయితే అన్న ఆందోళనతో ఎవరితోనూ స్నేహం చెయ్యలేక పోయింది.

చివరికి తనను చదివించాలనే నిర్ణయించుకున్నారు. తొమ్మిదో తరగతిలో వుండగా యిక ఆ ఆందోళన పోయాక సరితతో స్నేహం కుదిరింది. సరితదీ తనదీ ఒక కులం కాదు గానీ సమాన స్థాయిలో వుండే కులాలే -

అందువల్ల యింట్లో వాళ్ళ కళ్ళు తమ మీద పడలేదు. హాయిగా ఆనందంగా స్నేహం చేశారు. కాలేజీలో కూడా యిద్దరూ ఒక గ్రూపే తీసుకున్నారు.

ఎంత బాగుండేవి ఆ రోజులు - బి.ఏ. మొదటి సంవత్సరం! ఆ యవ్వనోత్సాహం. ఈ ప్రపంచమంతా తమకోసమే అన్నంత ధీమా - ఆ నవ్వులకు అంతం వుండేదా? ఒకర్ని చూసుకోగానే ఒకరికి ఎందుకంత ఆనందం కలిగేదో తెలిసేదా? భుజాలమీద చేతులు వేసుకునో, చేతులు పట్టుకునో ఆ కాలేజీ చెట్ల కిందుగా నడుస్తుంటే యిక మరే విషయమూ పట్టేది కాదు!

కానీ రెండో సంవత్సరంలో సరిత ప్రేమలో పడింది.

"వినుము చెలీ తెలిపెదనూ పరమ రహస్యం, అది మరి ఎవరూ ఎరుగరాని మధుర రహస్యం" అంటూ ఆ ప్రేమ విషయంతనతో చెప్పింది. తనకు బాధ పడాలో సంతోషించాలో అర్థం కాలేదు. సరిత తనకు దూరమవుతుందా? ఎవరీ కృష్ణ?

కృష్ణతో పరిచయం చేసింది సరిత. కృష్ణ మంచివాడే అనిపించింది. రోజూ కాలేజీ వదిలే వేళకు వచ్చేవాడు. కాసేపు ముగ్గురూ కబుర్లు చెప్పుకున్నాక వాళ్ళిద్దరూ కలిసివెళ్ళేవాళ్లు. మర్నాడు సరిత యిచ్చే వాళ్ళ ప్రోగ్రెస్ రిపోర్టు కోసం రాత్రి ఎపుడు గడుస్తుందా అని ఆతృత పడేది తను.

రాను రానూ సరితా కృష్ణల ప్రేమ పెరిగింది. వాళ్ళిద్దరూ సినిమాలూ షికార్లు మొదలుపెట్టారు. అపుడపుడూ జయా వాళ్ళతో వెళ్తోంది. ఓ రోజు రాత్రి అన్నం తిని చదువు కోటానికి పుస్తకాలు తీస్తుండగా

అన్నయ్య "జయా - జయా - జయేదీ" అని గావు కేకలు పెడుతూ వచ్చాడు.

జయ హాల్లోకి వెళ్ళింది.

"నువ్వా సరితతో స్నేహం మానెయ్యి"

అన్నాడు తన ఆజ్ఞమీదే సర్వ ప్రపంచం నడుస్తున్నట్లు.

ఇంట్లో అందరూ ఆ సరికి హాల్లో చేరనే చేరారు. "అమ్మా - దీని స్నేహితురాలు సరిత లేదూ? అది మంచిది కాదే - ఎవడితోనో కలిసి తిరుగుతోంది. నాలుగైదు సార్లు చూశాను గాని - ఎవరో బంధువేమో అనుకున్నా - ఇవాళ పార్కులో వాళ్ళిద్దరూ చేరి ముద్దులు, కావలింతలూ అన్నీ అక్కడే - జయా - రేపట్నించి నువ్వా సరితతో కన్పించావో చంపేస్తా".

"నీ కొక్క మంచి స్నేహితురాలు దొరకదేమిటే" అమ్మ గొంతు దు:ఖంతో బొంగురు పోయింది.

"వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారు" తన్నుకొస్తున్న దు:ఖాన్ని కంట్రోలు చేసుకుంటూ అంది జయ.

"వాళ్ళ బొంద చేసుకుంటారు - వాళ్ళ వ్యవహారం చూస్తుంటే ఒట్టి కక్కుర్తి మనుషుల్లా వున్నారు. పెళ్ళి చేసుకుంటే అపుడు వెళ్లి విందులు కుడుద్దువు గానిలే - ఇప్పుడు మాత్రం దాని స్నేహం మానెయ్ - దాన్ని మనింటికి తీసుకురాకు. నువ్వు దానింటికి వెళ్ళకు."

జయకు తన జీవితంలో ఎన్నడూ రానంత కోపం వచ్చింది.

"నా స్నేహితురాలితో నేను స్నేహం మానేస్తానో లేదో అది తర్వాత సంగతి. నువ్వు మాత్రం యింకొక్కసారి నా ఫ్రెండ్‌ని అదీ యిదీ అన్నావో మర్యాద దక్కదు" జయ వెళ్ళి తన మంచం మీద పడుకుని రాత్రంతా ఏడుస్తూనే వుంది.

మర్నాడు తన చదువు ఆపెయ్యమని అన్నయ్య చాలా రభసే చేశాడు. "ఇంకొక్క ఏడాదేగా కాస్త కట్టడి చేద్దాంలే" అన్నాడు నాన్న.

"రెండేళ్ళు డబ్బు తగలేశాం - ఆఖరి నిముషంలో ఎందుకు ఆపటం" అంది అమ్మ-

ఈ మాటలన్నీ వింటూ అవమానంతో దహించుకు పోతూ వుంది జయ.

వీళ్ళందరి దయాభిక్ష ఎందుకు కావాలి తన చదువుకు -

తన చదువు - తన స్నేహం, తన జీవితం అన్నీ వాళ్ళ నిర్ణయాల మీద ఆధారపడి ఎందుకుండాలి?

తనేమిటి? తనేమిటి? తనేమిటి?

సరితతో ఈ సంగతంతా చెప్పి ఏడ్చింది. ఇద్దరూ కాలేజీలో కలవటం తప్ప ఒకరిళ్ళకు ఒకరు పోవటం లేదు.

ఆ సంవత్సరం పరీక్షలయ్యాయి. ఎండాకాలం అంతా ఒకర్నొకరు కలవకుండా ఎలా వుండాలో అర్థంకాక కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. రెండు నెలలేగా అని ఓదార్చుకున్నారు.

కానీ - కానీ - ఆ తర్వాత సరిత మరి కన్పించలేదు.

మరో పది రోజుల్లో కాలేజీ తెరుస్తారనగా జయ పెద్దమ్మ కూతురి పెళ్ళికి ఒక్క రోజు వైకుంఠపురం వెళ్ళి వచ్చింది.

రాగానే అమ్మ ఏదో కొంప మునిగినట్లు చెప్పింది "ఆ సరితను మనింటికి రావద్దని చెప్పలేదేమిటే? నిన్న పొద్దున్నే వచ్చి కూచుంది. అన్నయ్య చూసి చిల్లర మనుషులొచ్చే యిల్లు కాదిది అని కేకలేసి పంపేశాడు. ఆడపిల్ల ఏడుస్తూ వెళ్ళిన వుసురు మనకెందుకురా అంటే వినకుండా కేకలేశాడు. ఆ పిల్ల వెళ్లిపోయింది."

జయకు కోపంతో కళ్ళెర్రబడిపోయాయి. అన్నయ్యను తందామన్నంత కోపం వచ్చింది. సరిత దగ్గరకు వెంటనే వెళ్ళాలనిపించింది. "ఏదో ఓ వంకతో వెళ్ళిపోతాను - వీళ్ళ మాటలకు విలువిచ్చేదేమిటి" అనుకుని స్నానం చేసి తయారవుతోంది. ఇంతలో అన్నయ్య ఆనందంగా వచ్చి చెప్పాడు.

"మీ సరిత నిద్రమాత్రలు మింగి చచ్చిపోయింది తెలుసా?"

ఆ మాటలు ఎట్లా మెదడులోకి యింకాయో, ఎట్లా తట్టుకుందో తనకే తెలియదు.

సరిత ఎందుకు ఆత్మహత్య చేసుకుంది?

అంత అవసరం ఏమొచ్చింది? తనతో ఎందుకు చెప్పలేదు? అన్నీ తనతో చెప్పుకునే సరిత - చెప్పుకోటానికే తన యింటికి వచ్చింది. తను ఒచ్చేదాకా తన యింట్లో కూచునే వీలుంటే తనతో చెప్పేది. తను సరితను రక్షించగలిగేది. ఈ ఇంట్లో వాళ్ళంతా హంతకులు. సరితను చంపేశారు.

అసలు సరిత ఎందుకు చనిపోయింది? కృష్ణ మోసం చేశాడా? వాళ్ళింట్లో తెలిసి గొడవచేశారా? ఏమయిందో తెలియని గందరగోళం. నాలుగు రోజులు పెద్ద జ్వరం.

జ్వరం తగ్గుతుండగా తన క్లాస్‌మేట్స్ సువర్చల, సీత వచ్చి విషయమంతా చెప్పారు.

కృష్ణ వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడట.

వాళ్ళిం:ట్లో వాళ్ళను ఎదిరించలేక పోయాడట -

కృష్ణ పెళ్ళి జరిగే సమయంలోనే సరిత చనిపోయిందట.

జయకు కృష్ణమీద కంటే తనమీదా, తన యింట్లో వాళ్ళ మీదా ఎక్కువ కోపం వచ్చింది. సరిత ఎంత బాధపడిందో - ఎంత ఏడ్చిందో - ఒక్కమాట తనతో చెప్పాలని ఎంత అల్లాడిందో. అన్నయ్య మాటలతో అసలే కుంగిన ఆమె చావుని ఆశ్రయించిందేమో -

ఒక్క ధైర్యపు మాట సరితకు అందివుంటే బతికేదేమో -

తన పిరికితనం సరిత చావుకి కారణమేమో -

తనతో చెప్పుకోవాలని సరితకు ఎంత కోర్కెవుండి వుంటుందో తనూహించగలదు. అట్లా చెప్పుకోటానికి వీల్లేని స్నేహం స్నేహమేనా?

ఒక్క ధైర్యవచనం అందించటానికి చోటు దొరకని స్నేహం స్నేహమేనా? తను ఈ ఇంట్లో వుండి ఎవరితోనూ స్నేహం చెయ్యలేదు.

అసలు ఆడదానిగా పుట్టి స్నేహం కోసం ఆశపడకూడదు -

కులం, వయసు, నీతులు, యింట్లో వాళ్ళూ అన్నీ ఆటంకాలే ఆడవాళ్ళ స్నేహానికి - అన్నయ్య స్నేహితులెవరో తనకు తెలుసూ? ఎందుకు అన్నయ్య తన గురించీ, తన స్నేహితుల గురించీ పట్టించుకుంటాడు? నాన్నకెందరో స్నేహితులు. ఇతర కులాల వాళ్లూ వస్తారు. అమ్మ

కసలు స్నేహితులు లేరు - బంధువులు తప్ప. అమ్మకు స్నేహం చేసే అవకాశం రాలేదు. తనకు మాత్రం స్నేహం అంటే తెలుసా? స్నేహం చేసే అర్హత వుందా తనకు?

సరితా! నీకు నాతో వున్నంత గాఢ స్నేహం మరింకెవరితోనన్నా వుంటే బతికేదానివా?

ఆ స్నేహితురాలూ నాలా పిరికిది కాకుండా నీ కష్టంలో నిన్నాదుకోగలిగేదా?

సరితా - సరితా - ఒక్కసారి కన్పించవా?

ఒక్కమాట చెప్పవా?

సరితా - సరితా - నిన్ను చూడాలి. ఎట్లా? ఎట్లాగమ్మా. ఒచ్చి ఒక్కసారి నా భుజం మీద చెయ్యి వెయ్యవూ. నా చెయ్యి పట్టుకుని కాలేజీకి రావూ? నా ఒళ్ళో తలపెట్టుకుని మెరిసే కళ్ళతో నీ ప్రేమ కబుర్లు చెప్పవూ?

సరితా-సరితా- నామీద ఎంత కోపంతో వెళ్ళిపోయావో గదా - ఒక్క మాట చెప్పకుండా.

జయ సరిత జ్ఞాపకాల నుండి బైటపడి మళ్ళీ కాలేజీకి వెళ్ళటానికీ, సరిత చావుకి కారణ మని తను నమ్మిన తన వాళ్ళతో సహజీవనం చెయ్యటానికీ చేసిన యుద్ధం ఎలాంటిదో ఎంత భీకరమైందో, ఎన్ని గాయాలయ్యాయో, ఎంతెంత రక్తాలు కారాయో ఎవరికీ తెలియదు. అర్థం కాదు.

బి.ఏ మూడో సంవత్సరంలో జయకూ పెళ్ళి సంబంధాలు చూడసాగారు.

జయకు ఆ యింటినుంచి వెళ్ళిపోవాలనే వుంది. కథల్లో నవలల్లో జరిగినట్లు తనకు మంచి భర్త దొరికితే - ఆ భర్తతో తన జీవితం హాయిగా గడిచిపోతుందేమో. తన యిల్లు తనకుంటే, తన స్నేహితుల్ని తన యింటికి రానివ్వగలిగిన స్థితి వుంటుందేమో - జయకు ఎన్నో ఆశలు.

కానీ అంతా తన అదృష్టం. ఆ వచ్చేవాడు ఎలాంటివాడో - జయకు ఎంతో భయం. కానీ మోహనరావుని చూస్తే ఎంతో ఆశ కలిగింది. అతను నిజంగా మంచివాడు. పెళ్ళి చూపుల్లోనే ఎంతో హుందాగా ప్రవర్తించాడు.

పెళ్ళిలో తన ప్రాణ స్నేహితుడంటూ చక్రవర్తి అనే అతన్నీ, అతని భార్య మాలతినీ పరిచయం చేశాడు.

చక్రవర్తికి కూడా ఆ క్రితం నెలలోనే పెళ్ళయిందట.

ప్రాణ స్నేహం చెయ్యగల మోహనరావు తన భర్త కావటం అదృష్టం కాక మరేమిటి? చక్రవర్తీ మోహనరావూ ఒకే ఆఫీసులో ఒకే హోదా కలిగిన ఉద్యోగాలు చేస్తున్నారు.

"మేం ఒకటో క్లాసు నుండీ యిప్పటివరకూ ఎన్నడూ విడిపోలేదు. ఉద్యోగాలు కూడా అలాగే వచ్చాయి. చక్రిని చూడకుండా ఒక్కరోజుండ లేను" అంటున్న భర్త వంక ఎంత ఆరాధనగా చూసిందో తను.

తమ కోసం చక్రవర్తి వాళ్ళింటికి దగ్గర్లోనే యిల్లు చూసి పెట్టాడు.

తనను యిష్టపడే భర్త. దేనికీ లోటు లేని జీవితం. చక్రవర్తి దంపతుల స్నేహం. జయకు పాత గాయాలన్నీ మానాయి. ముఖ్యంగా మాలతి ఆమెలో జీవశక్తి నింపింది.

మాలతి ఎంత చురుకైనదో తెలివైనదో - హుషారైనదో.

ఇద్దరూ కలిసి సినిమాలు, షికార్లు, షాపింగులు. ఇవి ఎవరితోనైనా చేయవచ్చు.

కానీ చర్చలు - మాలతి ప్రతి విషయాన్నీ ఎంతో వివరంగా చర్చించేది. పేపర్లో రాజకీయాల దగ్గరనుండి, పత్రికల్లో వచ్చే కథలు, సినిమాలు - అన్నీ విశ్లేషించి చెప్పేది. ఆమె చెబుతుంటే అట్లాగే వినబుద్ధయ్యేది. మాలతి పాట -

ప్రతి వెన్నెలరాత్రి నలుగురూ డాబా మీద చేరి మాలతి పాటలు వినేవాళ్ళు -

రాత్రీ, వెన్నెలా అన్నీ ఆ పాటలో కరిగిపోయేవి. మాలతి స్నేహం మోహన్రావు మూలంగానే అనుకుంటే జయకు మోహన్రావు మీద ప్రేమ పెరిగిపోయేది.

"ఈ ముద్దు మాలతి లాంటి ఫ్రెండునిచ్చినందుకు" అని గట్టిగా భర్తను ముద్దు పెట్టుకునేది.

ఆ రోజుల్లోనే జయ యింటికెదురుగా పక్క పక్క వాటాల్లో వున్న రెండు కుటుంబాల్లో ఒక చిత్రం జరిగింది. ఆ కుటుంబాల్లో ఆడవాళ్ళిద్దరికీ ఎందుకొచ్చిందో గాని తగువొచ్చింది. ఇద్దరూ భీకరంగా పోట్లాడుకున్నారు. బజారంతా వినపడేలా అరిచేసుకున్నారు. అది ఒక రోజుతో ఆగలేదు. రెండు రోజులకో సారి ఆడవాళ్ళిద్దరూ బజార్న పడేవారు.

"ఇద్దరూ ఇళ్ళు మారొచ్చుగా. రోజూ ఎందుకీ చెర వాళ్ళకు" అంది జయ విసుగొచ్చి.

"మగాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూనే వున్నారు ఆడవాళ్ళకే వచ్చింది-" అన్నాడు మోహన్రావు.

ఒకరోజు సాయంత్రం ఆ ఎదురింటాయన ఏదో పనిమీద వస్తే మోహన్రావు చెప్పాడు. ఆ పేటలోనే మరో యిల్లు ఖాళీగా వుందనీ కావాలంటే మారొచ్చనీ -

"మేం ఇల్లు మారతామని ఎందుకనుకున్నారు?" అన్నాడాయన ఆశ్చర్యపోతూ -

"రోజూ మీకూ పక్కింటివాళ్ళకూ గొడవగా వుంది గదా మారతారేమో అనుకున్నా" నన్నాడు మోహన్రావు తనలో ఆ ఆలోచన రేపిన జయ వంక కోర చూపు చూస్తూ -

"ఆ ఆడముండలేదో గొడవ పడుతుంటారు. ఆయన మంచివాడే - మేమిద్దరం బాగానే వుంటాం వాళ్ళే సర్దుకుంటార్లెండి. ఆ మాత్రానికి యిల్లు మారాలా?" అని వెళ్ళిపోయాడు.

జయ బుర్ర తిరిగిపోయింది. ఆ విషయాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో కూడా తెలియలేదు.

కానీ సరిగ్గా అట్లాంటి పరిస్థితే తనకు ఎదురవుతుందని జయ ఆ క్షణంలో అనుకోలేదు. సరిగ్గా సంవత్సరానికి జయకు అగ్ని పరీక్ష రానే వచ్చింది.

ఒకటో క్లాసునుంచీ ఉద్యోగాలు సంపాదించుకునే వరకూ సమాన స్థాయిలో వున్న చక్రవర్తి, మోహనరావుల మధ్య పెద్ద తేడా వచ్చింది. చక్రవర్తి ఆఫీస్ మేనేజర్ అయ్యాడు.

మోహనరావుకి యిక ఆ అవకాశమే లేదు. ఎప్పటికీ చక్రవర్తి మేనేజర్ మోహనరావు సూపర్‌వైజర్.

ఈ తేడా యిద్దరి మగవాళ్ళ మధ్యా చాలా ఎడాన్ని తెచ్చింది.

చక్రవర్తికి ప్రమోషన్ యిచ్చారనగానే ఆనందంతో కావలించుకోవాల్సిన మోహనరావు కరచాలనం చేసి వెళ్ళిపోయాడు.

చక్రవర్తి యింట్లో జరిగిన పార్టీలో జోకులన్నీ చక్రవర్తే వేశాడు. మాలతీ జయలు పార్టీ హడావుడిలో వీళ్ళిద్దరినీ పట్టించుకోలేదు. దాదాపు వంటలన్నీ జయే దగ్గరుండి జాగ్రత్తగా చేసింది.

మాలతి వచ్చిన వాళ్ళను ఆహ్వానించే పని చూసుకుంటే జయ గిన్నెలు, ప్లేట్లు సర్దించి భోజనాల పని చూసుకుంది.

ఆ రాత్రి మోహనరావు -

"నిన్ను నువ్వేమనుకుంటున్నావు - ఆ మాలతి దగ్గర నౌకరువనుకుంటున్నావా?" అనడిగితే జయకు అర్థం కాలేదు. అయోమయంగా చూసింది.

బహుశ జయ వేరే బెంచీలో కూచున్నపుడు మరియమ్మ చూసిన చూపదే కావచ్చు.

"అదేంటి అలా అంటావు-"

"మరి - ఆవిడ చక్కగా అలంకరించుకుని గేటు దగ్గిర నించుంటే నువ్వు వంటింట్లో చమటలు కక్కుతున్నావెందుకు -

"నేనెటూ ఆఫీసులో వాడి కిందవాడినే - నువ్వన్నా కాస్త డిగ్నిటీ మెయిన్‌టెయిన్ చెయ్యి"

ఈ మాటల్నీ, ఈ మాటల వెనక వున్న అర్థాన్నీ - మోహనరావులో ఒచ్చిన మార్పునీ గమనించిన జయ ఒణికిపోయింది. మాలతి - మాలతి కూడా తనకు దూరమవుతుందా? జయ అనుమానం రోజురోజుకీ బలపడుతుందేగాని తగ్గటం లేదు -

మోహనరావు చక్రవర్తి యింటికి వెళ్ళటం తగ్గించాడు. వాళ్ళొచ్చినా మౌనంగా వుంటున్నాడు. మాలతి తెలివైంది గాబట్టి వెంటనే అర్థం చేసుకుంది.

"మా ఆయనకు మేనేజర్‌గా ప్రమోషన్ రాకున్నా బాగుండేది" అంది.

ఆమె కళ్ళల్లో బాధ చూసి జయకు మోహన్రావు మీద కోపం వచ్చింది.

"ఒక్క మెట్టుపైకెక్కిన స్నేహితుడిని చూసి ఓర్చుకోలేక పోతే - అట్లాంటి స్నేహితుడి కోసం ప్రమోషన్ ఒదులుకోవటం ఎందుకు? ఆ స్నేహానికి అంత అర్హత వుందా?"

తన భర్తకు వ్యతిరేకంగా, ఒక మనిషిగా మాట్లాడిన జయను గౌరవంగా ప్రేమగా చూసింది మాలతి.

"వాళ్ళ గొడవలు మన మధ్యకు రానివ్వకుండా మన స్నేహాన్ని బతికించుకో గలమా?" ఎప్పుడూ ధైర్యంగా గలగల నవ్వుతూ వుండే మాలతి గొంతులో దీనత్వం.

జయకు గత అనుభవాలన్నీ వుప్పెనలా వచ్చి మీద పడ్డాయి. ఆమె మనసో వాయుగుండమయింది.

"బతకదు మాలతీ - మన స్నేహం బతకద - బతకనివ్వరు. మా నాన్న, అమ్మ, అన్న అందరూ నా స్నేహాన్ని అణిచేశారు. చంపేశారు. ఇప్పుడీయన కూడా అంతకంటే తక్కువ అనిపించటం లేదు - నాకు చాలా భయంగా వుంది" జయ ఏడుస్తుంటే మాలతి ఓదార్చి పాట పాడింది.

"దోస్త్ దోస్త్ నా రహా - ప్యార్ ప్యార్ నా రహా-"

ఎందుకు - ఎందుకు వుండదు?

స్నేహితుల మధ్య అభిప్రాయ భేదాలొస్తే అది వేరే సంగతి.

కానీ అసలు మన స్నేహాల మీద వీళ్ళ పెత్తనాలేమిటి?

ఆ పెత్తనాలకు మనం లొంగటమేమిటి? ఎందుకు లొంగాలి?

జయ ప్రశ్నలు మాలతి మనసులో మరిన్ని ఆలోచనలు రేపాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ మోహనరావు ఆఫీసులో అశాంతులన్నీ యింటికి మోసుకు రావటం ఎక్కువయింది. అతను చక్రవర్తిని తిడుతుంటే విని భరించలేకపోతోంది జయ -

అవన్నీ విని మళ్ళీ మాలతి ముఖం చూడలేకపోతోంది.

భర్త ఆఫీసుకు వెళ్ళగానే యిద్దరూ ఒక యింట్లో చేరలేకపోతున్నారు.

మోహన్రావు వేరే వుద్యోగాలకోసం అప్లికేషన్లు పెడుతున్నాడు.

"వాడి కంటే రెండొందలన్నా ఎక్కువ జీతం తెచ్చుకుంటే గాని నాకు శాంతి వుండదు" అనేశాడు.

భర్తల వికృతరూపాలు భార్యల కంటే ఎక్కువగా ఎవరికి కనిపిస్తాయి?

జయకు మోహనరావు ముఖంలో అందం కనిపించటం మానేసింది.

చివరికి వైజాగ్‌లో ఉద్యోగం దొరికింది.

"పీడ ఒదిలింది. బుద్ధి తెలిసిననాటినుంచీ వీడి పీడే నాకు. ఎందులోనూ ఎక్కి రాకుండా చూశాడు. వాడిగ్రహణం ఒదిలింది గదా యిక చూడు నేనెట్లా పైకి పోతానో" ఇన్నాళ్ళ స్నేహాన్ని మోహన్రావు వికృత పరిచిన తీరుకి జయ నివ్వెరపోయింది.

నిజంగా యిన్నాళ్ళనుంచీ మనసులోపలి పొరల్లో చక్రవర్తి స్నేహం గురించి యితనికిదే అభిప్రాయం వుందా? వుంటే అదెంత ఘోరం - వుండకపోతే అంత స్నేహాన్ని యిలా మలిన పర్చగలగే మొరటుతనం యితనికెక్కడినుంచి వచ్చింది?

దేనికి? డబ్బుకా, అధికారానికా, స్నేహాన్నింత హీనపర్చగలిగిన శక్తి వుంది. అసూయా?

★ ★ ★

"ఇక లేచి ఆటో ఎక్కు - సామాన్ల లారీ బయల్దేరుతోంది" మోహన్రావు జయను కుదిపి ఆలోచనల్లోంచి బైటపడేశాడు. చివరిగా మాలతికి చెప్పిరావాలి. అది చాలా బాధాకరమైన

పనే అయినా తప్పదు. జయ మాలతి దగ్గరకు వెళ్ళేసరికి మాలతి ఏడుస్తోంది.

జయను చూడగానే లేచి వచ్చి కావలించుకుంది.

"నాకు యిదే మంచిదనిపిస్తోంది మాలీ - రోజూ దగ్గరుండి ఒకర్నొకరు చూసుకుంటూ మరింత అసూయలూ, అహంకారాలూ పెంచుకుంటున్నారు. దూరంగా వుంటే మళ్ళీ కాస్త కుదుటపడి మారతారేమో" అంది జయ.

"కానీ వాళ్ళవల్ల మనం ఎందుకు దూరమవ్వాలి? నువ్వూ నేనూ వీళ్ళని వొదిలి వుద్యోగాలు వెతుక్కుని మనం స్నేహంగా బతకలేమా?" మాలతి కోపం చూసి జయ జాలిగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు? స్నేహం కోసం ఎంత మంది మగవాళ్ళు ఎన్ని త్యాగాలు చేశారు, వాళ్ళ భార్యలతో సహా - అవన్నీ ఎంతెంత గొప్ప గాథలై మనచేత కన్నీళ్ళు కార్పించాయి. మనం మన స్నేహం కోసం ఈ భర్తల్ని ఒదిలేద్దాం. ఎందుకు ఒదిలెయ్యగూడదు?" మాలతి కోపం కట్టలు తెంచుకుంటోంది.

"అపుడది త్యాగం అవదు మాలతీ - ఒళ్ళు కొవ్వెక్కటం అవుతుంది. మనకి ఆ గౌరవం దక్కదు. మన గురించి ఎవరూ కథలూ గాథలూ రాయరు. రాసినా తిడుతూ రాస్తారు. ఆ భర్తల్ని మార్చుకోలేరా అంటారు. ఆ మార్చుకునే భారమంతా మనమీదే వేస్తారు. ఆ భర్తలమాట ప్రకారం నడుచుకోక ఏం తీపరం అంటారు. ఒకవేళ మన గురించి ఎవరైనా కథ రాస్తే ఏం రాస్తారో తెలుసా?

మనం భర్తల్ని ఒదిలి - చిన్న వుద్యోగాలు చేస్తూ ఎన్నో బాధలు పడి, ఎవరి అండాలేక దిక్కులేని వాళ్ళమై, ముసలితనంలో ఒంటరిగా చావుకోసం ఎదురుచూసే దృశ్యాన్ని రచయితలు హృదయాల్ని కరిగించేలా రాస్తారు -

స్నేహం కోసం భర్తను ఒదిలేస్తే భద్రత మాటేమిటని నిలదీసి మన జీవితాన్ని చూసి మిగిలిన వాళ్ళని బుద్ధి తెచ్చుకోమంటారు.

ఆడవాళ్ళకు స్నేహం చేసే అవకాశం లేదు మాలతీ -

స్నేహం చెయ్యాలన్నా, మానాలన్నా, మనుషులకు దగ్గరవ్వాలన్నా, దూరమవ్వాలన్నా స్వేచ్ఛ కావాలి మనకు- స్త్రీలకు ఆ స్వేచ్ఛ లేదు - మనకు స్నేహం ఎట్లా దొరుకుతుంది - ఈ మొగుడు కాకుంటే మరింకో మొగుడెవడో వస్తాడు మన స్నేహానికి ఆంక్షలు పెట్టటానికి".

జయ ఆవేశంగా మాట్లాడుతుంటే మాలతి జయవంక కొత్తగా చూస్తోంది.

జయ యిక ఏం చెయ్యాలో తెలియని దానిలా, మళ్ళీ మాలతి కనిపించదు అనే వూహతో మాలతిని కళ్ళలో నింపుకోవాలన్నట్లు చూస్తోంది.

చూసీ, చూసీ - వెనక్కు తిరిగి తన యింటిముందు సామాన్లు నిండిన లారీ వెనకగా ఆగివున్న కారు ఎక్కి కూచుంది. స్నేహాన్ని వెనక ఒదిలి కారు ముందుకి వెళ్ళిపోయింది.

*- ఆంధ్రప్రభ వారపత్రిక, 13-9-95*